సంపుటి :02 సంచిక :173 పేజీలు :06 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

సోమవారం 01, సెప్టెంబర్ 2025

# న్యాయం చేయండి

- పేదల జాగలపై కన్నేసిన శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి
- హన్మకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఇందిరమ్మ కాలనీవాసుల వినతి
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందజేత

04



# సీలింగ్ బద్దలు కొడితేనే



# 42% బీసీ కోటా

- రిజర్వేషన్లకు 50% పరిమితే అసలైన సమస్య
- పీఆర్ చట్ట సవరణ బిల్లుపై సర్వత్రా చర్చ
- గవర్నర్ బిల్లును ఆమోదిస్తారా?
- ఆమోదిస్తే ఎవరైనా కోర్టుకెళితే.. పరిస్థితేంటి?
- అన్ని అడ్డంకులు దాటితేనే గ్రామ పంచాయతీ ఎన్నికలు
- లేదంటే.. కాంగ్రెస్ సర్కార్ పార్టీపరమైన కోటా అంటుందా?
- అదే జరిగితే.. ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

స్థానిక సంస్థలలో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించ టంలో ఎదురవుతున్న సమస్య లను అధిగమించేందుకు సర్కార్ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టంలోని 285 (ఏ) క్లాజ్ కి ప్రతిపాదించిన సవరణ బిల్లుని శాసనసభ ఆదివారం ఏకగ్రీ వంగా ఆమోదించింది. చట్టం లోని రిజర్వేషన్ల పరిమితి 50 శాతం మించరాదనే 285 (ఏ) క్లాజ్ ని ఎత్తి వేయటం ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది అయితే ఈ సవరణ బిల్లుపై గవర్నర్ నిర్ణయం ఎలా ఉండబోతుంది? ఈ సవరణ బిల్లు న్యాయ సమీక్ష ముందు నిలబడుతుందా! హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా! అనే అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాం శంగా మారింది.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

04



## కొనసాగుతున్న యూరియా వెతలు

- మానుకోటలో రహదారుల దిగ్బంధం
- కేసముద్రంలో తొక్కిసలాట
- మహిళా రైతుకు గాయాలు

05




# అవినీతిపై ఉక్కుపాదం

- 8 నెలల్లో 167 మంది అరెస్టు
- వీరిలో 20 మంది మహిళా అధికారులు

05

- దూకుడు పెంచిన అవినీతి నిరోధక శాఖ
- కరెప్షన్‌లో రెవెన్యూశాఖ టాప్
- ఆ తర్వాతి స్థానాల్లో పోలీస్, మున్సిపల్ శాఖలు

తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దూకుడు పెంచింది. గడిచిన ఎనిమిది నెలల్లో 179 కేసులు నమోదు చేసి అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పటివరకు 167 మంది ప్రభుత్వ ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్ పట్టించింది. ఆయా కేసుల్లో మొత్తం రూ.44.30 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసింది. గత నెలలో ఏసీబీ 31 కేసులు నమోదు చేసింది. 22 మంది ప్రభుత్వ ఉద్యోగులు, నలుగురు ప్రైవేట్ ఉద్యోగులను అరెస్ట్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏసీబీకి పూర్తి స్వతంత్రత ఇచ్చింది. అవినీతి అధికారులు ఏ శాఖలో ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా.. ఉపేక్షించొద్దని తేల్చిచెప్పింది. ఫిర్యాదులు రాగానే వెంటనే రంగంలోకి దిగాలని ఆదేశించింది. దీంతో లంచాల విషయం తెలిస్తే తమకు సమాచారం అందించాలంటూ టోల్‌ఫ్రీ నంబర్ ను, వాట్సాప్‌నంబర్ ను జనంలోకి విస్తృతంగా ఏసీబీ అధికారులు తీసుకెళ్తున్నారు.

-అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



## వైద్య విద్యకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి

- కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో సంబురాలు
- జీవో నెంబర్ 33ను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకటించడంపై నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం

05

# ఇరిగేషన్ ఈఈగా బసవ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి ఇరిగేషన్ డివిజన్-1 డిఈగా విధులు నిర్వహిస్తూ ఇంచార్జి ఈఈగా కొనసాగుతున్న బసవ ప్రసాద్‌కు పదోన్నతి లభించింది. ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) గా పదవి బాధ్యతలు స్వీకరించిన బసవ ప్రసాద్, సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను ఐడీఓసీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసవ ప్రసాద్‌ను అభినందించి, భవిష్యత్తులోనూ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

శాయంపేట, అక్షర దర్బార్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శాయంపేట మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ మరియు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు సహా పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

## భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే పోలీసులకు సూచించారు.

సోమవారం భూపాలపల్లిలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా దివాస్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతాంశంగా పరిగణించి, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.





# చల్లా పరామర్శలు..

అక్షర దర్బార్, పరకాల: నడికుడ మండలంలోని కంటాత్మకూరు, ధర్మారం, ముస్త్యాలపల్లి, చౌటుపర్తి గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు చింతిరెడ్డి వెంకట్రాంరెడ్డి, దూలం రమేష్, బందెల కాంతలక్ష్మి, వేల్పుల శృతి కుటుంబాలను సోమవారం రోజున పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించి పరామర్శించారు. కార్యకర్తలు కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### భారతీయ స్ఫూర్తి సేవా రత్న నేషనల్

# అవార్డు అందుకున్న జన్నె యుగేందర్

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రానికి చెందిన జన్నె యుగేందర్‌కు భారతీయ స్ఫూర్తి సేవా రత్న నేషనల్ అవార్డు లభించింది. హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ సమావేశంలో ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుల రమేష్, సీనియర్ హాస్యనటుడు జనార్దన్ రావు (జెన్నీ) చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. కళారంగంలో విశేష సేవలు అందించడం, పలు సామాజిక అంశాలపై పాటలు, నాటకాలతో ప్రజలను చైతన్యపరచడం, కరోనా సమయంలో అవగాహన కల్పించడం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం వంటి కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. అవార్డు అందుకున్న యుగేందర్‌ను చిట్యాల మండల ప్రజలు అభినందించారు.



### ఎమ్మెల్యే రేవూరి జన్మదిన వేడుకలో

# మెగా రక్తదానం

అక్షర దర్బార్, పరకాల: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. సమాజానికి సేవలందించేందుకు ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ సోద అనిత రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.






### వికలాంగుల ఆశ్రమంలో

## రేవూరి జన్మదిన వేడుకలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిట్టీరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో వికలాంగుల ఆశ్రమంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, వికలాంగులైన విద్యార్థులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మడికొండ సంపత్ కుమార్, ఆముదాలపల్లి మల్లేశం గౌడ్, డాక్టర్ మడికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయి

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, పరకాల: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదని, ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేయడం పట్ల ఇప్పుడు బాధపడుతున్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. సోమవారం ఆత్మకూర్, దామెర, గీసుగొండ మండలాల సమన్వయ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల చిల్లర రాజకీయాలు, తప్పుడు కేసులను పార్టీ అండదండలతో ఎదుర్కొంటామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం బీఆర్ఎస్‌కే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలని పిలుపునిచ్చారు.



# పెంచిన పెన్షన్లు అమలు చేయాలి: ఎమ్మార్పీఎస్

అక్షర దర్బార్, చిట్యాల: గత ఎన్నికల హామీ మేరకు పెంచిన పెన్షన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో తలపెట్టిన 'మహా గర్జన'కు సబ్బండ కులాలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి మడిపల్లి శ్యాంబాబు మాదిగ పిలుపునిచ్చారు. చిట్యాలలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దొడ్డే శంకర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వికలాంగుల పెన్షన్ ₹6,000, వృద్ధులు, వితంతువులు, బీడీ, చేనేత, కల్లుగీత కార్మికుల పెన్షన్ ₹4,000కు పెంచాలని డిమాండ్ చేశారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.




### బెజ్జంకి పూర్ణచారి ఆధ్వర్యంలో

# మహా అన్నప్రసాదం

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీలోని 9వ వార్డు, శ్రీనగర్ కాలనీలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా "బెజ్జంకి పూర్ణచారి" ఆధ్వర్యంలో మహా అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. కుంకుమ పూజ అనంతరం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్, ఎస్సైలు రమేష్, విటల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైం : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బూరుగు రవి ఆధ్వర్యంలో వందలాది మంది ఉద్యోగులు ఈ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూరుగు రవి మాట్లాడుతూ, 2004 సెప్టెంబర్ 1 తర్వాత ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ కన్వీనర్ ఎల్. విజయలక్ష్మి, కో-చైర్మన్ మార్కా రామ్మోహన్ మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని, ఐదేళ్లు పనిచేసిన ప్రజాప్రతినిధులకు పెన్షన్ ఉన్నప్పుడు, దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగులకు ఎందుకు లేదని నాయకులు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు దిల్షాద్ తో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ సెంటర్లలో సమయపాలన తప్పనిసరి

### ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద

అక్షర దర్బార్, చిట్యాల: అంగన్‌వాడీ సెంటర్లలో టీచర్లు, ఆయాలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద ఆదేశించారు. సోమవారం చిట్యాల రైతు వేదికలో జరిగిన చిట్యాల, నైన్‌పాక సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. టీచర్లు, ఆయాలు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని స్పష్టం చేశారు. పిల్లల నమోదు, హాజరు శాతాన్ని పెంచాలని, వారికి తెలుగు, ఇంగ్లీష్ బోధనతో పాటు నర్సరీ, యూకేజీ, ఎల్కేజీ అక్షరాలు, పదాలు వర్క్‌బుక్ ద్వారా నేర్పించాలని సూచించారు. పిల్లలకు వేడి వేడిగా, రుచికరమైన భోజనం అందించాలని, బాలమృతం, పల్లి పట్టి తీసుకునేవారికి ఫేస్ క్యాప్చర్ చేశాకే ఫుడ్ ఇవ్వాలన్నారు. ప్రతి నెల పిల్లల బరువు, ఎత్తు చూసి పోషకాహార లోపాన్ని గుర్తించి, ఆరోగ్య పరీక్షలు చేయించాలని తెలిపారు. నెలకొకసారి తల్లుల సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహాలు, గృహహింస, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో 58 మంది టీచర్లు పాల్గొన్నారు.



# జాతీయ అవార్డు అందుకున్న రామకృష్ణ

### అభినందించిన మండల ప్రజలు

అక్షరదర్బార్, టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ళ రామకృష్ణగౌడ్ రాష్ట్రీయ సేవ పురస్కర్ జాతీయ అవార్డు 2025 ను హైదరాబాదులోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్పూర్తి అకాడమీ ఫౌండర్, చైర్మన్ ఆకుల రమేష్, ఇతర ప్రముఖులతో పాటు, తన తండ్రి నేరేళ్ల చేరాలు గౌడ్ చేతుల మీదుగా అందుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అన్ని కులాలను ఏకం చేయడం, ఆయన చేసిన వివిద సామాజిక కార్యక్రమాలను గుర్తించడం, నాడు తెలంగాణ ఉద్యమంలో చురుగ్గ పాల్గొని రాష్ట్ర సాదనలో తనదైన ప్రతిభ కనపర్చడం, నేడు బీఆర్ఎస్ కార్మిక శాఖ తరుపున కార్మికులను ఏకతాటిపైకి తేవడం, వారిని చైతన్య పరచడంతో పాటు, వారి హక్కుల కోసం పోరాడం చేయడాన్ని గుర్తించి ఉత్తమ జాతీయ ఆవార్డును అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. మారుమూల గ్రామమైన బూర్నపల్లి నుండి జాతీయ స్థాయి ఆవార్డును అందుకోవడం పట్ల మండల ప్రజలు రామకృష్ణగౌడ్ కి శుభాకాంక్షలు తెలిపి అభినందిస్తున్నారు.





# పత్తి దిగుమతులపై సుంకం రద్దు దారుణం

### సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేశ్

నర్సంపేట, అక్షర దర్బార్: పత్తి దిగుమతులపై 11శాతం సుంకాన్ని ఎత్తివేయడం దేశీయ పత్తి రైతులకు తీవ్ర నష్టమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ అన్నారు. పత్తికి కనీస మద్దతు ధర ( ఎంఎస్‌పీ) క్వింటాల్‌కు ₹10,075 ప్రకటించి, ఎన్నికల హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం నర్సంపేటలో జరిగిన రైతు సంఘాల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ, దిగుమతి సుంకం తొలగింపు వల్ల దేశీయ పత్తి ధరలు తగ్గుతాయని, ఇది రైతులకు నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో, ఈనెల 3న అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించి, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్లు ఈసంపల్లి బాబు, సోమిడి శ్రీనివాస్, జిల్లా నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్తో పాటు పలువురు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# న్యాయం చేయండి

- పేదల జాగలపై కన్నేసిన శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి
- హన్మకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఇందిరమ్మ కాలనీవాసుల వినతి
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందజేత

అక్షరదర్బార్, హనుమకొండ: గత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాలపై కన్నేసిన దర్గా కాజీపేటకు చెందిన గంకిడి శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని గ్రేటర్ వరంగల్ 49వ డివిజన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన నిరుపేదలు హన్మకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం కాలనీ కమిటీ ఆధ్వర్యంలో హన్మకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 49వ డివిజన్ దర్గా కాజీపేట ఇందిరమ్మ కాలనీలో గల సర్వే నంబర్ 299లో 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు కేటాయించిందన్నారు. తమకు కేటాయించిన స్థలాల్లో వందల మంది ఇండ్లు కట్టుకొని కొన్నేండ్లుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. మరికొందరు ప్రస్తుతం ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారని, మరికొన్ని ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ఈక్రమంలోనే దర్గా కాజీపేటకు చెందిన గంకిడి శ్రీనివాస్‌రెడ్డి రెండు నెలల కింద ప్రభుత్వ భూమిలో దౌర్జన్యంగా రాత్రికి రాత్రి హద్దు రాళ్లు పాతారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన కాలనీవాసులను ఈ భూమి తనదేనని, ఇండ్లు ఖాళీ చేసి వెళ్లాలని భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన తాము కాలనీ కమిటీ అధ్యక్షుడు నారాయణగిరి శ్రీనాథ్ నేతృత్వంలో కొద్ది రోజుల కింద గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. కాలనీలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిస్తామని భరోసా ఇచ్చారని తెలిపారు. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో సదరు శ్రీనివాస్‌రెడ్డి తాజాగా హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారని, తమను ఇండ్లు వదిలి వెళ్లాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడని వాపోయారు. పైసాపైసా కూడబెట్టి ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇండ్లు నిర్మించుకున్నామని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలాన్ని కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్న శ్రీనివాస్‌రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే కాలనీవాసులంతా కలిసి ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.



# మహా ధర్నాకు తరలిన పీఆర్టీయూ శ్రేణులు

అక్షర దర్బార్, మరిపెడ : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన మహా ధర్నాకు మరిపెడ మండలం నుండి పెద్ద సంఖ్యలో పీఆర్టీయూ శ్రేణులు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా మరిపెడ మండల పీఆర్టీయూ అధ్యక్షుడు కీసర రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్ మాట్లాడుతూ, 'సీపీఎస్ అంతం - పీఆర్టీయూటీఎస్ పంతం' అనే నినాదంతో ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు తరలివెళ్లిన వారిలో పీఆర్టీయూ బాధ్యులు దోమల లింగయ్య, సునీల్ కుమార్, దత్త ప్రసాద్, గండి కరుణాకర్, గుర్రం వెంకన్న, యాదగిరి, వెంకన్న, వేముల శ్రీను, వేల్పుల వెంకటయ్య, విజయ్ కుమార్, భరత్, లెనిన్, రవి, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.





## కోటగుళ్ల గణపేశ్వరుడికి
# కరెన్సీ మాలల అలంకరణ

అక్షరదర్బార్, గణపురం: కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ గణపేశ్వరునికి వినాయక చవితి నవరాత్రి పర్వదినాల సందర్భంగా నూతన కరెన్సీ మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి ఏడు వినాయక నవరాత్రులను పురస్కరించుకొని కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కరెన్సీ మాలలతో అలంకరణ చేయడం ఆనవాయితీగా వస్తుంది. గణపతి నవరాత్రుల తో పాటు సోమవారం పర్వదినం కావడంతో వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కరెన్సీ మాలలతో అలంకరించిన గణపేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు.

## హరీశ్, సంతోశ్ వల్లే
# కేసీఆర్‌పై అవినీతి మరకలు

- కాళేశ్వరం అవకతవకల వెనుక వారిద్దరే
- సీఎం రేవంత్‌రెడ్డి వెనుక ఉండి నడిపిస్తున్నారు..
- కేసీఆర్‌పై సీబీఐ విచారణ విధించాక.. ఇక బీఆర్ ఎస్ ఉంటే ఎంత పోతే ఎంత?
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



అక్షరదర్బార్, హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్, మాజీ ఎంపీ సంతోశ్ వల్లే పార్టీ అధినేత కేసీఆర్‌పై అవినీతి మరకలు పడ్డాయని పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం కుంగుబాటు వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సోమవారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్‌కు నష్టం చేస్తున్న వాళ్ల పేర్లను మొదటిసారి తాను బయటపెడ్తున్నానని హరీశ్‌రావు, సంతోశ్ పేర్లు బయపెట్టారు. కాళేశ్వరం అవకతవకల వెనుక హరీశ్‌రావుది మేజర్ పాత్ర లేదా? హరీశ్‌రావు, సంతోశ్ వెనక సీఎం రేవంత్ ఉన్నారని ఆరోపించారు. వారిద్దరూ తనపై పెద్ద ఎత్తున కుట్రలు చేశారని పేర్కొన్నారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణపై ఆమె స్పందిస్తూ.. నా కడుపు రగిలిపోతుంది. మానాన్నకు తిండి మీద,డబ్బు మీద యావ ఉండదు. తరతతరాల తరగని ఆస్తిని కేసీఆర్ తెలంగాణ ప్రజలకు ఇచ్చారు. కేసీఆర్ పక్కన ఉన్న వాళ్లలో ఉన్న కొంతమంది వల్లే ఇలా జరిగింది అని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ పై సీబీఐ విచారణ విధించిన తర్వాత, బీఆర్ఎస్ ఉంటే ఎంత పోతే ఎంత ? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నేను ఇలా మాట్లాడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం జరగొచ్చు. నష్టం జరిగినా సరే నేను ఇలాగే మాట్లాడతా. మొత్తం కాళేశ్వరం ఎపిసోడ్‌లో కేసీఆర్‌కు మరక అంటడానికి ఇద్దరు, ముగ్గురే కారణం అని పేర్కొన్నారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ అంటే బీఆర్ఎస్ తెలంగాణ బంద్‌కు పార్టీ ఎందుకు పిలుపునివ్వలేదని నిలదీశారు. `అధికారుల వెనుక ఎవరున్నారో దర్యాప్తు చేయండి. ఎవరో ఆడిస్తే ఆడే ఆటబొమ్మను కాదు. పిచ్చి వాగుడు వాగితే తోలుతీస్తా. కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తిలేదు. పార్టీ ఓటమికి కారణం కేసీఆర్ వెంట ఉన్నవాళ్లే' అని ఉద్వేగంగా మాట్లాడారు.

# 70 టన్నుల యూరియా దిగుమతి

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలంలోని రైతులకు అవసరమైన యూరియా సోమవారం దిగుమతి అయింది. మొత్తం 70 టన్నుల యూరియాను వివిధ రైతు సేవా కేంద్రాలకు, ఎరువుల దుకాణాలకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి (ఏవో) గంగా జమున తెలిపారు. ఇందులో శాయంపేటలోని సాయి ఫెర్టిలైజర్స్ షాపునకు 25 టన్నులు, ప్రగతి సింగారం గ్రామంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 20 టన్నులు, శాయంపేటలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 20 టన్నులు, గట్లకనపర్తి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ కు 5 టన్నులు కేటాయించారు.



# నాగరాజుకు ఆర్థిక సాయం

**రూ.1,07,669 అందజేసిన మెపా తెలంగాణ**

అక్షరదర్బార్, హనుమకొండ : హనుమకొండ స్నేహనగర్ కు చెందిన జర్నలిస్టు పల్లెబోయిన నాగరాజు ముదిరాజ్ కు ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఇటీవల గాల్ బ్లాడర్ స్టోన్ ఇన్ఫెక్షన్ తో క్రిటికల్ పొజిషన్ కు చేరుకున్న జర్నలిస్టు నాగరాజు ముదిరాజ్ కు హైదరాబాదులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో సర్జరీ జరిగింది. ఇందుకు నాగరాజుకు రూ.4 లక్షలకు పైగా ఖర్చు అయిందని తెలుసుకున్న మెపా నాగరాజుకు ఆర్థికంగా తమ వంతు సహాయం చేయాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు మెపా రాష్ట్రవ్యాప్తంగా 193 మంది ముదిరాజ్ దాతల ద్వారా రూ.1,07,669 సేకరించింది. ఈ మొత్తాన్ని సోమవారం హనుమకొండ స్నేహనగర్ లోని నాగరాజు ఇంటి వద్ద చెక్కు రూపంలో నాగరాజు కుటుంబ సభ్యులకు మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అందజేశారు. మెపా రాజకీయాలకు అతీతంగా కష్టాల్లో ఉన్న ముదిరాజ్ జాతి బిడ్డలకు తోడుగా ఉంటుందని, ఎవరికి ఎప్పుడు ఆపద వచ్చినా తోచిన సహాయాన్ని అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నంరాజు ముదిరాజ్, రాష్ట్ర సలహాదారులు పులి ప్రభాకర్ ముదిరాజ్, నీరటి రాజు ముదిరాజ్, వ్యవస్థాపక సభ్యులు బోనాల రమేష్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు, ఉపాధ్యక్షులు పొన్నం రాజు, గౌరవ సలహాదారులు పులి ప్రభాకర్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల విజేందర్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు సంకెళ్ల శ్రీధర్, పోలుదాసరి రాము, బైరి సోమన్న ముదిరాజ్, బోడ రంజిత్, ఒద్దుల హరీష్, కట్ల విజయ్, పిట్టల రాజు, మిట్టపల్లి సాంబయ్య, కాజీపేట బాబన్న, గోనెల సాగర్, దేవేందర్, పిట్టల దినేష్, బాలబోయిన సంతోష్, గోనెల సాయిరాం, నర్ర శివాజీ, సుధాకర్ విక్రం, సూరితో పాటు ఏనుగులగడ్డ ముదిరాజు యువత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# బుగులోని జాతర అభివృద్ధి పనులకు జీఎస్సార్ శంకుస్థాపన

అక్షర దర్బార్, రేగొండ : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) బుగులోని శ్రీ వెంకటేశ్వర స్వామి గుట్టలను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా రూ. 1.60 కోట్ల అటవీ శాఖ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. మెట్ల విస్తరణ, రెయిలింగ్ ఏర్పాటు, కోనేరు నుండి గుట్టపైకి తాగునీటి సౌకర్యం వంటి పనులను ఈ నిధులతో చేపడతారు. గతంలో జాతరకు వచ్చే రోడ్లకు కూడా నిధులు మంజూరయ్యాయని గుర్తు చేస్తూ, ఈ పనులన్నీ త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





# గుంతలమయమైన కేసముద్రం రోడ్లు

అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయని సీపీఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గుంతలమయమైన రోడ్ల వద్ద నిలబడి, స్థానిక ఎమ్మెల్యేకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం వందల కోట్లు కేటాయించినా, రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని విమర్శించారు. గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాసు సాయి చరణ్, సామ సారయ్య, భూక్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# వైద్య విద్యకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి

- కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో సంబురాలు
- జీవో నెంబర్ 33ను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకటించడంపై నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం



అక్షరదర్బార్, వరంగల్: వైద్య విద్యలో ప్రవేశాల కోసం స్థానికత విషయంపై నెలకొన్న సందిగ్ధత వీడింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. వరంగల్ లోని కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. మిఠాయిలు తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు. వైద్య విద్యలో ప్రవేశాల కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33ను అమలు చేయాలని నీట్ పేరెంట్స్ అసోసియేషన్ ఇటీవల అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం సుప్రీంకోర్టు తెలంగాణలో వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని తీర్పు ఇచ్చిందని పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నీట్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ చారీ మాట్లాడుతూ తీర్పు చాలా సంతోషకారంగా ఉందని అన్నారు. గతంలో తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి, డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు పక్కన పెడుతూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. గత సంవత్సరం మెడికల్ విద్యార్థులకు అన్యాయం జరిగిందని, ఈ సంవత్సరం అలా జరగకుండా మంచి తీర్పు ఇచ్చారని అన్నారు. హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ నాగార్జున రెడ్డిని కలిసి తమ ఆనందాన్ని పంచుకొని స్వీట్ తినిపించారు. ఈ కార్యక్రమంలో రమేష్ కుమార్, రఘుపతి, అఫ్జద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# సీలింగ్ బద్దలు కొడితేనే



## 42% బీసీ కోటా

- రిజర్వేషన్లకు 50% పరిమితే అసలైన సమస్య
- పీఆర్ చట్ట సవరణ బిల్లుపై సర్వత్రా చర్చ
- గవర్నర్ బిల్లును ఆమోదిస్తారా?
- ఆమోదిస్తే ఎవరైనా కోర్టుకెళితే.. పరిస్థితేంటి?
- అన్ని అడ్డంకులు దాటితేనే గ్రామ పంచాయతీ ఎన్నికలు
- లేదంటే.. కాంగ్రెస్ సర్కార్ పార్టీపరమైన కోటా అంటుందా?
- అదే జరిగితే.. ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

**స్థానిక సంస్థలలో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించటంలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు సర్కార్ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టంలోని 285 (ఏ) క్లాజ్ కి ప్రతిపాదించిన సవరణ బిల్లుని శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. చట్టంలోని రిజర్వేషన్ల పరిమితి 50 శాతం మించరాదనే 285 (ఏ) క్లాజ్ ని ఎత్తి వేయటం ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది అయితే ఈ సవరణ బిల్లుపై గవర్నర్ నిర్ణయం ఎలా ఉండబోతుంది? ఈ సవరణ బిల్లు న్యాయ సమీక్ష ముందు నిలబడుతుందా! హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయా! అనే అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.** —అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## ఆర్డినెన్స్ ఏమవుతుంది?

రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టంలోని 285 (ఏ) క్లాజ్ కి ప్రతిపాదించిన సవరణ బిల్లుని, 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తి వేయాలనే నిర్ణయాన్ని గవర్నర్ ఆమోదిస్తారా! ఒకవేళ ఆమోదించినా 42 శాతం రిజర్వేషన్లు అమలులోకి వస్తాయా అనే సందేహాలు కలుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంపిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై రాష్ట్రపతి నిర్ణయంలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరొక ప్రత్యామ్నాయంగా క్యాబినెట్ ఆమోదంతో 285 (ఏ) క్లాజ్ కి సవరణలు ప్రతిపాదిస్తూ ఆమోదం కోసం గవర్నర్ కి పంపినారు కానీ గవర్నర్ ఆ సవరణ ప్రతిపాదనలపై (ఆర్డినెన్స్) నిర్ణయం తీసుకోవడానికి న్యాయ సలహా కోసం కేంద్ర హోంశాఖకు పంపించారు. క్యాబినెట్ తీర్మానంపై నిర్ణయం తీసుకొని గవర్నర్ సవరణ బిల్లుపై నిర్ణయం తీసుకుంటారని ఎలా భావించాలి?, ఒకవేళ గవర్నర్ నిర్ణయం తీసుకుని బిల్లును ఆమోదించినా రిజర్వేషన్లు అమలు సాధ్యం కాకపోవచ్చు.

## చట్ట సవరణ అంత సులభమా?

2018 తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టంలో స్థానిక సంస్థలలో ఎస్సీ ఎస్టీలకు 27 శాతం రిజర్వేషన్లు, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు మొత్తం 61 శాతం రిజర్వేషన్లు ప్రతిపాదించిన బిల్లును నాటి గవర్నర్ నరసింహన్ ఆమోదించినప్పటికీ, ఆ బిల్లు న్యాయ సమీక్ష ముందు నిలబడలేదు. హైకోర్టు, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవటం వలన 61 శాతం రిజర్వేషన్లు అమలులోకి రాలేదు. చివరికి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు సూచనలతో ఎస్సీ, ఎస్టీలకు 27 శాతం రిజర్వేషన్లతో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లతో మొత్తం 50 శాతం రిజర్వేషన్లతోనే 2019లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించారు.. కాబట్టి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ బిల్లుని గవర్నర్ ఆమోదించినా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం దాదాపు అసాధ్యమని గతంలో ఎదురైన అనుభవాలు రుజువు చేస్తున్నాయి.

## న్యాయ సమీక్షకు నిలబడేనా?

సవరణ బిల్లుకి గవర్నర్ ఆమోద ముద్ర వేసినా ఆ బిల్లులో రిజర్వేషన్ల పరిమితి 50 శాతం దాటిన నేపథ్యంలో ఎవరైనా న్యాయస్థానాలను ఆశ్రయిస్తే కోర్టులు జోక్యం చేసుకొని విచారణ సందర్భంగా ఏ ప్రాతిపదికన రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేశారు, పరిమితిని ఎత్తివేసే అధికారం ఒక రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా అనే ప్రశ్నలకి రాష్ట్ర ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుంది. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలంటే ముందుగా 243 (డి)(టి) ఆర్టికల్ తో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించిన 1994 చట్టానికి సవరణలు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అలాగే ట్రిపుల్ టెస్ట్ ఆధారంగానే స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఖరారు చేయాలనే 2010 సుప్రీం కోర్టు తీర్పుపై సమీక్ష జరగాల్సి ఉంది. అప్పుడే 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేత జరుగుతుందే కానీ.. ఒక రాష్ట్ర ప్రభుత్వం తనకు తానుగా చట్టంలోని 50 శాతం పరిమితిని ఎత్తివేసినా ఉపయోగమేమీ ఉండదు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేసే అంశం రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశం కూడా కాదు కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ బిల్లు న్యాయ సమీక్ష ముందు నిలబడకపోవచ్చు.

## ఎన్నికలు వాయిదానేనా?

ఈ నెల 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున సవరణ బిల్లును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించకపోతే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకి మరికొంత గడువు కోరే అవకాశం ఉంది. ఒకవేళ సవరణ బిల్లును గవర్నర్ ఆమోదిస్తే , ఆ బిల్లును సవాల్ చేస్తే న్యాయస్థానాలలో ఛాలెంజ్ చేస్తే ఎన్నికల అంశం కోర్టు పరిధిలో ఉంటుంది కాబట్టి ఎన్నికల వాయిదా పడే అవకాశాలు ఉంటాయి. సవరణ బిల్లు ఆమోదం పొందినా ఆమోదం పొందకపోయినా, ఎన్నికలు వాయిదా వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సవరణ బిల్లు ఒక అందివచ్చిన అవకాశంగా కనిపిస్తున్నది. ప్రభుత్వం కూడా ఎన్నికలు వాయిదా పడాలనే కోరుకుంటుంది. ఒక బిల్లుపై గవర్నర్ లేదా రాష్ట్రపతి మూడు నెలల లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో సవరణ బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదు కాబట్టి స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టుకి ప్రభుత్వం విజ్ఞప్తి చేసే అవకాశం లేకపోలేదు.

## పార్టీ పరమైన రిజర్వేషన్లేనా?

**చట్టపరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైతే ఈ సమస్యను కూడా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తున్నది. ముందుగా ప్రాదేశిక ఎన్నికలైన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రాదేశిక ఎన్నికలు పార్టీపరంగా జరుగుతాయి కాబట్టి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 566 జడ్పీటీసీ స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ పరంగా బీసీలకు 237 జడ్పీటీసీ స్థానాలను, 5,773 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,424 ఎంపీటీసీ స్థానాలను బీసీ వర్గాలకి కేటాయించి తమ మాట నిలబెట్టుకున్నామని చెప్తుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మొత్తానికి బీసీలకు లోకల్ ఎన్నికల్లో 42 శాతం కోటా సాధించటం ఓ సుదీర్ఘమైన ప్రక్రియగా కనిపిస్తున్నది. ప్రభుత్వం కచ్చితంగా న్యాయపరమైన, చట్టపరమైన అవరోధాలు దాటి మాత్రమే కోటా ఇవ్వగలదనేది సుస్పష్టం.**

# జర్నలిస్టులకు రాయితీపై వైద్యం అందించాలి

## జిల్లా కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే వినతి

అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లాలోని జర్నలిస్టుల కుటుంబాలకు జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లలో 50% రాయితీపై వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్జేయూ) జిల్లా నాయకులు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టీఎస్జేయూ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ మాట్లాడుతూ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఎలాంటి జీతభత్యాలు లేకుండా అహర్నిశలు ప్రజాసేవకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు రాయితీపై వైద్య సేవలు అందించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షాలు, వరదలపై సీఎం సమీక్ష

అక్షర దర్బార్, భూపాలపల్లి : భారీ వర్షాలు, వరదల సహాయక చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. భూపాలపల్లి జిల్లా నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఐడీఓసీ కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



# 'ప్రజా పాలనలోనైనా పల్లెల అభివృద్ధి జరిగేనా?'

దుగ్గొండి, అక్షర దర్బార్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు గడిచినా పల్లెల అభివృద్ధిపై పాలకులు చిన్న చూపుతో వ్యవహరిస్తున్నారని ఎంసీపీఐ(యు) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్ ఆరోపించారు. సోమవారం రేబల్లె గ్రామంలో పర్యటించిన ఆయన, గ్రామ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ కార్యదర్శికి అందజేశారు.ఈ సందర్భంగా రాజాసాహెబ్ మాట్లాడుతూ.. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేవని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, లేకపోతే పోరాటాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ హుస్సేన్ సహా పలువురు పాల్గొన్నారు.

### సీపీ క్యాంపు ఆఫీస్ లో

# ప్రత్యేక లౌంజ్

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయంలో సీపీని కలిసేందుకు వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గది (లౌంజ్)ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం ప్రారంభించారు. సందర్శకులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ లౌంజ్ ఏర్పాటు చేశారు. ఇందులో కూర్చునే సౌకర్యాలు, తాగునీటి సదుపాయం, పత్రికలు వంటి అవసరమైన వసతులు సమకూర్చారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ "ప్రజలు పోలీస్ కార్యాలయానికి వచ్చే సందర్భంలో వేచి ఉండే సమయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ లౌంజ్ ఉపయోగపడుతుందని, ప్రజలకు సౌకర్యం కల్పించడం మా ప్రాధాన్యత" అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్ రావు, శ్రీనివాస్, ఏసీపీలు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.





# కొనసాగుతున్న యూరియా వెతలు



మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో యూరియా టోకెన్ల కోసం రైతు వేదిక ఎక్కిన రైతులు

## మానుకోటలో రహదారుల దిగ్బంధం

## కేసముద్రంలో తొక్కిసలాట

## మహిళా రైతుకు గాయాలు

అక్షరదర్బార్, మహబూబాబాద్: యూరియా కోసం రోజుల తరబడి తిరుగుతున్న రైతులు సోమవారం ప్రభుత్వాల తీరును నిరసిస్తూ రోడ్డెక్కారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మరిపెడ, కురవి, కేసముద్రం మండల కేంద్రాల్లో అన్నదాతలు రాస్తారోకో నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కేసముద్రం రైతు వేదిక వద్ద వందలాది మంది రైతులు టోకెన్ల కోసం నిరీక్షించగా ఏవో వెంకన్న, ఎస్ఐ మురళీధర్ రాజ్ ఆధ్వర్యంలో టోకెన్ల పంపిణీ చేపట్టగానే ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ క్రమంలో యూరియా బస్తాల కోసం ముందు వరసలో ఉన్న మహిళలు చాలామంది కింద పడ్డారు. ఈ సంఘటనలో బేరువాడకు చెందిన అనిత అనే మహిళ రైతు కాలుకు గాయమైంది. అలాగే మరికొందరికీ స్వల్ప గాయాలయ్యాయి. క్యూ పద్ధతి కోసం ఏర్పాటుచేసిన భారీ కేడ్లు తొలగించి మరీ రైతులు ఒక్కసారిగా రైతు వేదిక వద్దకు దూసుకెళ్లారు. దీంతో పోలీసులు కూడా ఏం చేయలేక చేతులెత్తేశారు. తోపులాట తీవ్ర స్థాయికి చేరుకొని ఏకంగా కొందరు రైతు వేదిక భవనం పైకి చేరి కిటికీల ద్వారా టోకెన్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. మొత్తంగా కేసముద్రంలో సోమవారం యూరియా టోకెన్ల జారీ ప్రక్రియ పూర్తిగా రసాభాసగా మారింది. ఇక మరిపెడలో సోమవారం యూరియా ఇస్తామని చెప్పి శుక్ర, శనివారం టోకెన్లు



మహబూబాబాద్ జిల్లా కురవి వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇచ్చి ఇప్పుడు వస్తే యూరియా మంగళవారం వస్తుందని చెప్పడంతో ఏవో నిర్లక్ష్యం వల్ల తమకు యూరియా సకాలంలో అందని పరిస్థితి ఏర్పడిందని పెద్ద ఎత్తున రైతులు ఖమ్మం- వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో వల్ల పెద్ద ఎత్తున వాహనాలు రోడ్డు కిరువైపులా నిలిచిపోయి ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలిగింది. సంఘటన తెలుసుకున్న సీఐ రాజ్ కుమార్ గౌడ్, ఎస్ఐ సతీష్, పోలీసులు అక్కడికి చేరుకొని టోకెన్లు పొందిన రైతులకు యూరియా ఇప్పిస్తామని, ఇప్పటివరకు యూరియా పొందలేని వారికి కూడా ఇప్పిస్తామని నచ్చజెప్పి రైతులను శాంతింపజేసి రాస్తారోకో విరమింప చేశారు. అలాగే కురవి మండల కేంద్రం వద్ద మహబూబాబాద్ మరిపెడ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఇదే తరహాలో జిల్లా కేంద్రంలో సైతం రాస్తారోకో చేశారు. కేసముద్రంలో టోకెన్లు పొందలేకపోయిన వారికి టోకెన్లు ఇవ్వాలంటూ రాస్తారోకో నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా రైతుల ఆందోళనలతో అట్టుడికి పోయింది. వానాకాలం పంటల సాగు చేపట్టి రెండు నెలలు కావస్తున్న ఇంతవరకు ఒక్క బస్తా యూరియా వేయలేకపోయామని, ఇంకెంతకాలం యూరియా కోసం తిరగాలంటూ అన్నదాతలు ప్రభుత్వ తీరును తీవ్రస్థాయిలో ఎండగట్టారు.

### -పంపిణీకి చర్యలు..

యూరియా కొరత నేపథ్యంలో జిల్లా అధికారులు ఇప్పటివరకు టోకెన్లు, కూపన్ల ద్వారా యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే ఈ పద్ధతి పెద్దగా సత్ఫలితాలు ఇవ్వకపోవడం, పెద్ద ఎత్తున రైతులు ఒకే చోట చేరి ఇబ్బందులకు గురి కావడం, తొక్కిసలాట తదితర సంఘటన నేపథ్యంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ నేరుగా రైతులకు యూరియా పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టారు. దీనితో ఇప్పటివరకు అనుసరిస్తున్న టోకెన్లు, కూపన్ల పద్ధతికి సోమవారం తెరదించారు. మంగళవారం నుండి వ్యవసాయ శాఖ ద్వారా ఆన్లైన్లో ఉన్న రైతు పట్టా పాస్ పుస్తకం నెంబర్ ఆధారంగా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున, రెవెన్యూ గ్రామ పరిధిలో సొసైటీ ఎరువుల విక్రయ కేంద్రం వద్దనే యూరియా పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు కేసముద్రం ఏవో వెంకన్న తెలిపారు. పట్టా పాస్ పుస్తకం నెంబర్ వరుస క్రమంలో రెవెన్యూ గ్రామంలో ఉన్న రైతులకు, పట్టా పాస్ పుస్తకం నెంబర్ ప్రకారం వరుసక్రమంగా యూరియా కేటాయించి, ఎరువుల విక్రయ కేంద్రం వద్దకు వెళ్లి యూరియా తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# అవినీతిపై ఉక్కుపాదం

- 8 నెలల్లో 167 మంది అరెస్టు
- వీరిలో 20 మంది మహిళా అధికారులు
- దూకుడు పెంచిన అవినీతి నిరోధక శాఖ
- కరెప్షన్‌లో రెవెన్యూశాఖ టాప్
- ఆ తర్వాతి స్థానాల్లో పోలీస్, మున్సిపల్ శాఖలు

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : తెలంగాణలో




అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) దూకుడు పెంచింది. గడిచిన ఎనిమిది నెలల్లో 179 కేసులు నమోదు చేసి అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పటివరకు 167 మంది ప్రభుత్వ ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్ పట్టించింది. ఆయా కేసుల్లో మొత్తం రూ.44.30 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేసింది. గత నెలలో ఏసీబీ 31 కేసులు నమోదు చేసింది. 22 మంది ప్రభుత్వ ఉద్యోగులు, నలుగురు ప్రైవేట్ ఉద్యోగులను అరెస్ట్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏసీబీకి పూర్తి స్వతంత్రత ఇచ్చింది. అవినీతి అధికారులు ఏ శాఖలో ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా.. ఉపేక్షించొద్దని తేల్చిచెప్పింది. ఫిర్యాదులు రాగానే వెంటనే రంగంలోకి దిగాలని ఆదేశించింది. దీంతో లంచాల విషయం తెలిస్తే తమకు సమాచారం అందించాలంటూ టోల్‌ఫ్రీ నంబర్ ను, వాట్సాప్ నంబర్ ను జనంలోకి విస్తృతంగా ఏసీబీ అధికారులు తీసుకెళ్తున్నారు.

### టాప్‌లో రెవెన్యూశాఖ..

బాధితుల నుంచి భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఆ ఫిర్యాదుల ఆధారంగా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి, లంచగొండులకు చెక్‌పెడ్తున్నారు. అక్రమాస్తులు ఉన్న ఆఫీసర్లనూ గుర్తిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఉన్నతాధికారుల ఇండ్లలో ఇటీవల తనిఖీలు చేసి, వందల కోట్లు విలువ చేసే ఆస్తులను ఏసీబీ సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రతి నెలా సగటున 20 మంది అవినీతి అధికారులు పట్టుబడుతున్నారు. సగటున నెలకు 20 కేసులు రికార్డవుతుండగా.. 20 మంది అరెస్టవుతున్నారు. ఈ ఎనిమిది నెలల్లో పట్టుబడిన అధికారుల్లో 20 మందికి పైగా మహిళా అధికారులు ఉన్నారు. మరికొంత మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఏసీబీ నమోదు చేసిన కేసులు, పట్టుబడిన అధికారుల లెక్కల ప్రకారం.. అవినీతిలో మొదటి స్థానంలో రెవెన్యూ శాఖ, రెండో స్థానంలో పోలీస్ శాఖ, మూడో స్థానంలో మున్సిపల్ శాఖ ఉన్నాయి.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915